క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. వరంగల్‌లోని భద్రకాళి ఆలయం, జీడబ్ల్యూఎంసీ కార్యాలయం, రంగంపేట, ఎంజీఎం క్రాస్ రోడ్, నగర శివారులోని భట్టుపల్లి, కొత్తపల్లి, సైనిక్‌పురి వ్యవసాయ ఫీడర్లు, లైటింగ్ రోడ్ కడిపికొండ, ఆర్‌జీకే క్వార్టర్స్, సూర్య కుటీర్, బోడగుట్ట, అయోధ్యపురం ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, నక్కలగుట్టలోని వినాయకనగర్, సర్క్యూట్ హౌజ్ రోడ్, కోర్టు ఏరియా, భవానినగర్, గోకుల్ నగర్, అశోక కాలనీ, వికాస్ నగర్, నక్కలగుట్ట మెయిన్ రోడ్ ప్రాంతాల్లో ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

ఆర్థికసాయం



కాజీపేట రూరల్ : డీజిల్ లోకోషెడ్‌లో టెక్నీషియన్–2గా పని చేస్తున్న మూల రాజు ఇటీవల మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి శనివారం రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.35 వేల ఆర్థికసాయం అందజేశారు. కడిపికొండలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. నాయకులు నరేష్, సత్యనారాయణ, ఎస్.తిరుపతి, రవికిరణ్, శివప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

టీఆర్‌పీఈఈయూ జిల్లా కమిటీ ఎన్నిక


లక్ష్మణ్ నాయక్


మహేష్

హన్మకొండ : తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా ధరావత్ లక్ష్మణ్ నాయక్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సాంబరాజు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా గొలుసు ఉపేందర్, జి.సంపత్, డి.నవీన్ కుమార్, ఉపాధ్యక్షులుగా వై.సంపత్ కుమార్, ఎ.వెంకటేశ్వర్లు, బి.వనిత, వి.సాంబమూర్తి, ఆర్.వేణు, చిర్ర సంజయ్ గౌడ్, ఎ.రాజకుమార్, ఎ.శ్రీనివాస్,కె.రాజు, రీజినల్ సెక్రటరీగా కడెం మహేష్, అదనపు కార్యదర్శి ఎస్.వేణు, జాయింట్ సెక్రటరీలు వేణు, కె.ప్రసన్న కుమారి, జాల రజని, బి.నవీన్ కుమార్, అన్వేష్ యాదవ్, రాజరపు సురేష్, పి.సుధాకర్, సీహెచ్.సువర్ణ దేవి, యుగేందర్, భరత్ కుమార్, సెక్రటరీ కిరణ్ కుమార్ జె.స్వప్న ట్రెజరర్ డి.భాస్కరచారి, ఆఫీస్ సెక్రటరీగా రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శశి కుమార్ వివరించారు.

ఆటపాటలతో ఆరోగ్యం

- డ్యాన్స్‌తో హెల్త్ బెనిఫిట్స్
- వయస్సుతో సంబంధం లేకుండా శిక్షణ

హన్మకొండ చౌరస్తా : మంచి పాట వినిపిస్తే చాలు మనసు గాలిలో తేలినట్లుగా ఉంటుంది.. మనకు తెలియకుండానే కాళ్లు. చేతులు ఊపుతూ స్టెప్పులేస్తుంటాం. ఇటీవల ట్రెండ్‌లో ఉన్న డీజే పాట వినబడితే చాలు వయస్సుతో సంబంధం లేకుండా డ్యాన్సులు ఇరగదీస్తుంటారు. అదే డ్యాన్సు ఆరోగ్యాన్ని కాపాడుతుందని తెలిస్తే ఇంకేముంది మూడు పాటలు.. ఆరు స్టెప్పులే. గంటల తరబడి జిమ్‌లు.. పార్కుల్లో నడవాల్సిన అవసరం లేదు. రోజుకో గంట ఇనిస్టిట్యూట్‌లో నచ్చిన పాటకు స్టెప్పులు నేర్చుకుంటే సరి.. అటు డ్యాన్స్ ఇటు ఆరోగ్యం సొంతమవుతుంది.


డ్యాన్స్ నేర్చుకుంటున్న చిన్నారులు


వ్యాయామం చేయిస్తున్న డ్యాన్స్ మాస్టర్

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో శారీరక వ్యాయామం లేకపోవడంతో ఊబకాయం, గుండె జబ్బుల వంటి ఎన్నో రోగాల బారిన పడుతున్నారు. ప్రతి రోజు 50 నిమిషాలు డ్యాన్స్ చేస్తే చాలు వ్యాయామం అక్కర్లేదంటున్నారు ఆరోగ్య నిపుణులు. దీంతో వయస్సుతో సంబంధం లేకుండా మహిళలు, పురుషులు వెస్టర్న్ డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ల వైపు చూస్తున్నారు. డ్యాన్స్ ఇనిస్టిట్యూట్‌లో నచ్చిన పాటకు స్టెప్పులు నేర్పించేముందు తేలిక పాటి వ్యాయామంలో శిక్షణ ఇస్తున్నారు. అందులో ఏరోబిక్స్ లాంటి ఫిట్‌నెస్‌లో వ్యాయామ శిక్షణ అందిస్తున్నారు. వయస్సు ఆధారంగా ప్రతి రోజు అర గంట నుంచి గంట పాటు ఏరోబిక్స్‌లో శిక్షణతో పాటు డ్యాన్స్ నేర్పిస్తున్నారు.

బరువు తగ్గడానికి డ్యాన్స్..



బరువు తగ్గడానికి అనేక రెమెడీలు ప్రయత్నించా, ఫలితం కనపడకపోవడంతో డ్యాన్స్ చేస్తే మంచి ఫలితం ఉంటుందని స్నేహితురాలు చెప్పింది. రెండు నెలలుగా ప్రతి రోజు సాయంత్రం గంట పాటు ఏరోబిక్స్‌తో పాటు చక్కటి పాటకు డ్యాన్స్ నేర్చుకుంటున్నాను. డ్యాన్స్ చేస్తుండడంతో చాలా సంతోషంగా ఉంటుంది.

– వనితారెడ్డి, భీమారం

శారీరక వ్యాయామానికి..



ఆరోగ్యం కోసం జిమ్, వాకింగ్‌కు వెళ్లాను, పాటలు వింటూ వ్యాయామం చేసేదానిని. స్నేహితురాలు చెప్పింది, పాటలు వింటూ వ్యాయామం చేయడం కంటే ఇష్టమైన డ్యాన్స్‌కు స్టెప్పులు నేర్చుకోమని. ఏడాదిగా నాకిష్టమైన పాటలకు స్టెప్పులు నేర్చుకుంటున్నాను. రోజు వ్యాయామం చేసినట్లుగా ఉంటుంది.

– పూజ, హనుమకొండ

15 ఏళ్లుగా నిర్వహణ



15 సంవత్సరాలుగా వెస్టర్న్ డ్యాన్స్ ఇనిస్టిట్యూట్‌ను నిర్వహిస్తున్నా. డ్యాన్స్ చేయడం వల్ల అలసట తెలియకుండానే క్యాలరీస్ కరిగిపోతుంటాయి. ఒబేసిటీ బారిన పడిన వారు సైతం ఆరు నెలల్లో బరువు తగ్గడం మొదలవుతుంది. మానసికంగా ఉత్తేజపరిచే పాటలకు అనుగుణంగా డ్యాన్స్ చేస్తుంటే తెలియకుండానే వ్యాయామం ముగుస్తుంది.

– ప్రశాంత్, డ్యాన్స్ అకాడమీ,యజమాని

వికసిత్ భారత్‌ను సాకారం చేసుకోవాలి

- యువత చేతిలోనే దేశ భవిష్యత్
- కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి


మాట్లాడుతున్న వీసీ కె.ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ : వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేసుకునేలా యువత ముందుకు రావాలని, యువత చేతిలోనే దేశ భవిష్యత్ అని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం కేయూలోని జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్‌హాల్‌లో జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ యూత్ పార్లమెంట్ వేదిక యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించటంతోపాటు జాతీయ అభివృద్ధి విధాన నిర్మాణం, సమస్యల పరిష్కారం వంటి అంశాలపై చర్చించేందుకు అద్భుత అవకాశం కల్పిస్తుందన్నారు. కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ మాట్లాడుతూ నాయకత్వం ఒక ఆలోచన, బాధ్యత, కర్తవ్యమన్నారు. మూడు జిల్లాల నుంచి 150 మంది డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఈ కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నారన్నారు. సమావేశంలో యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ టి. మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ మమత, నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ సి.హెచ్ అన్వేశ్, జిల్లా ట్రెజరీ ఆఫీసర్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాధిక, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి సూచించారు. శనివారం డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని పరిపాలన భవనంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ రామచంద్రం, డీఎస్‌ఏ రాష్ట్ర కో కన్వీనర్ గణేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సహకార స్ఫూర్తిని కలిగించాలి

- డీసీఓ సంజీవ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీఓ సంజీవ రెడ్డి

హన్మకొండ : ప్రజల్లో సహకార స్ఫూర్తిని, చైతన్యాన్ని కలిగించాలని హనుమకొండ సహకార అధికారి బి.సంజీవ రెడ్డి అధికారులకు సూచించారు. ఐక్య రాజ్య సమితి 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిన క్రమంలో శనివారం కలెక్టర్‌లో సహకార ఫంక్షనల్ రిజిస్ట్రార్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంజీవ రెడ్డి మాట్లాడుతూ సహకార సంఘాల సభ్యులను మరింత చైతన్యం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, జిల్లా సహకార ఆడిట్ అధికారి కె.కోదండరాములు, కల్పలత బజార్ ఎండీ ఎన్నమనేని జగన్‌మోహన్ రావు, కాకతీయ సహకార శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ యాకూబ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నీరు జీవితానికి ఎంతో విలువైనది

- డీఆర్ఓ గణేష్

విద్యారణ్యపురి : మానవాళి జీవితానికి నీరు ఎంతో విలువైందని జిల్లా రెవెన్యూ అధికారి వై.గణేష్ పేర్కొన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శనివారం హనుమకొండలోని న్యూశాయంపేట పోచంపల్లి ప్రభుత్వ పాఠశాలలో నీటి సంరక్షణ, వృక్ష సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో 300 మొక్కలు నాటారు. నీటి సంరక్షణ చెట్లపెంపకం, పర్యావరణ పరిరక్షణ పై ప్రతిజ్ఞ చేశారు.

నీటి వనరులను పరిరక్షించాలి

హసన్‌పర్తి : నీటి వనరులను కాపాడితేనే భవిష్యత్ తరాలకు భూగర్భ జలాలు అందించడం సాధ్యమవుతోందని ప్రజాతంత్ర ఆలోచన వేదిక వ్యవస్థాపకుడు తుపాకుల దశరథం పేర్కొన్నారు. 56వ డివిజన్ గోపాలపురంలో శనివారం ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని సూచించారు. మీసాల రమేష్, కమ్యూనిటీ హాల్ అధ్యక్షుడు ప్రభాకర్, అశోక్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

నీటిబొట్టును వృథా చేయొద్దు

ఖిలా వరంగల్ : నీటిని వృథా చేయకుండా ప్రతి నీటి బొట్టును సంరక్షించాలని అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు మండల పరశురాములు సూచించారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శనివారం రంగశాయిపేటలో అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో నీటి సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు.

కోటలో విదేశీయుల సందడి



ఖిలా వరంగల్ : ఖిలావరంగల్‌లోని మధ్యకోటను శనివారం ఫ్రాన్స్ దేశస్తులు వేర్వేరుగా సందర్శించారు. ఈ సందర్భంగా వారు అద్భుతమైన శిల్పకళ సంపదను తిలకించారు. అనంతరం ఖుష్‌మహల్, ఏకశిల గుట్ట, రాతి, మట్టికోట అందాలను వీక్షించారు. కాకతీయుల చారిత్రక విశిష్టతను కోట గైడ్ రవియాదవ్ ఫ్రాన్స్ దేశస్తులు వివరించారు. సాయంత్రం టీజీటీడీసీ కోట ఇన్‌చార్జ్ గట్టికొప్పుల అజయ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సౌండ్ అండ్ లైటింగ్ షోను వారు వీక్షించారు. ఈకార్యక్రమంలో కేంద్ర పురావస్తుశాఖ కోఆర్డినేటర్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

గంగదేవిపల్లిని సందర్శించిన కేడీసీ విద్యార్థులు



గీసుకొండ: జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కేడీసీ)లో రాజనీతిశాస్త్రం, చరిత్ర విభాగాల విద్యార్థులు శనివారం సందర్శించారు. చరిత్ర విభాగం హెడ్ ఇందిరాదేవి, రాజనీతిశాస్త్ర విభాగం హెడ్ బి.కవిత, అధ్యాపకులు కె.శ్రీదేవి, రవికుమార్, రాజేందర్, రాంరెడ్డి, రమేష్, విద్యార్థులు గ్రామ అభివృద్ధిని పరిశీలించారు. గ్రామం సాధించిన ప్రగతి, పొందిన దేశ, రాష్ట్రస్థాయి అవార్డులు, ఆదర్శంగా నిలిచిన తీరును జిల్లా శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి వారికి వివరించారు.

ప్రొస్టేట్ శస్త్ర చికిత్స విజయవంతం

హన్మకొండ చౌరస్తా /ఎంజీఎం : అత్యాధునిక పద్ధతిలో ఇద్దరికి ప్రొస్టేట్ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించామని యూరాలజిస్టు డాక్టర్ రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. హనుమకొండలోని శ్రీనివాస కిడ్నీ సెంటర్‌లో నిర్వహించిన ఆపరేషన్ వివరాలను శనివారం వెల్లడించారు. ఈనెల 21న ప్రొస్టేట్ గ్రంధి వాపుతో ఆసుపత్రికి వచ్చిన ఇద్దరు వృద్ధులకు రెసుమ్ అనే విధానంతో రోస్టరైజ్ ఆపరేషన్ చేసి అదే రోజు డిశ్చార్జ్ చేశామని తెలిపారు. ఎలాంటి మత్తు ఇంజక్షన్ ఇవ్వకుండా కేవలం మూడు నిమిషాల్లోనే ఆపరేషన్ చేశామని వివరించారు. హైదరాబాద్‌లోని రెండు ఆస్పత్రుల్లో మాత్రమే ఈ తరహా శస్త్రచికిత్స నిర్వహిస్తున్నారని వెల్లడించారు. డాక్టర్లు ప్రభురామ్, సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.


నూతన పరికరంతో డాక్టర్లు

క్షయ నివారణపై అవగాహన


సదస్సులో పాల్గొన్న అధికారులు, డాక్టర్లు

కాజీపేట రూరల్ : టీబీ రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని, క్షయ వ్యాధిపై నివారణపై అవగాహన ఉండాలని టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు సూచించారు. ఈనెల 24వ తేదీన ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా కాజీపేట రైల్వే డీజిల్ షెడ్‌లో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ ఎవరికైనా రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే దగ్గరలోని పీహెచ్‌సీలో పరీక్షలు చేసుకోవాలన్నారు. రైల్వే వైద్యాధికారి డాక్టర్ ధీరజ్‌కుమార్, జిల్లా మాస్ మీడియా అధికారి వి.అశోక్‌రెడ్డి క్షయ వ్యాధిపై నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎంఈ ఎస్.వి.వెంకటకుమార్, సోమిడి వైద్యాధికారి అనిత, సుష్మ, పి.కిరణ్‌కుమార్, డి.నగేష్, టి.విజయ, సునీత, అంజమ్మ, జ్యోతి, రైల్వే కార్మికులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల హక్కుల సాధనకు పోరాటం


సమావేశంలో మాట్లాడుతున్న రజనికాంత్

నయీంనగర్ : తమ న్యాయమైన హక్కుల సాధనకు తెలంగాణ ఉద్యమకారులు పోరాడేందుకు ముందుకు రావాలని ఉద్యమకారుల ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు నందగిరి రజనికాంత్ కోరారు. ఫోరం అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ నెల 24న ఓరుగల్లు బస్సుయాత్ర కరీంనగర్ నుంచి హనుమకొండ అమరవీరుల స్థూపం వద్దకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో రజనికాంత్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కాలంలో వందలాది యువకులు అమరులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్బండ వర్గాల ప్రజలు తమ అభీష్టం మేరకు ఉవ్వెత్తున జరిపిన పోరాటాలతో ప్రజలు సాధించుకున్న తెలంగాణలో వారి హక్కులను రాజకీయ పార్టీలు హరించి వేస్తున్నాయన్నారు. ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి 250 గజాల స్థలం, అమరుల కుటుంబాలకు పెన్షన్, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అనుముల రమేష్, శ్యామ్ కృష్ణ, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల స్వాధీనం

వరంగల్ : వరంగల్‌లోని ఎల్‌బీనగర్‌లో జక్కి రమేష్‌కు చెందిన పాన్‌షాప్ నుంచి రూ.29,800ల విలువైన నిషేధిత పొగాకు ఉత్పత్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.ఎ.షుకుర్ తెలిపారు.

బైక్ ఢీ..ఒకరికి గాయాలు

మడికొండ : రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మడికొండలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం మడికొండకు చెందిన బోసు నరేష్ ద్విచక్ర వాహనంపై మడికొండలోని మెట్టుగుట్ట ద్వారం వద్ద రోడ్డు దాటుతుండగా కాజీపేట నుంచి వస్తున్న బైక్ ఢీకొట్టింది. దీంతో నరేష్ తలకు గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం 108అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

దొంగ అరెస్ట్

రామన్నపేట : ఎంజీఎం ఆస్పత్రిలో బ్యాటరీలు, టైర్ల దొంగతనానికి పాల్పడుతున్న దొంగను మట్టెవాడ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్సై లచ్చయ్య, క్రైం పార్టీ పోలీసులు వరుస దొంగతనాలకు పాల్పడుతున్న బాలాజీనగర్‌కు చెందిన పస్తం బాలాజీకుమార్‌ను పట్టుకోవడం జరిగిందని సీఐ గోపి తెలిపారు.

సాహితీవేత్తకు నివాళి

హన్మకొండ కల్చరల్ : కాకతీయ విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యులు, సంస్కృత, ఆంగ్ల సాహితీవేత్త ఎస్.లక్ష్మణ్‌మూర్తి (86) శనివారం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. మిత్రమండలి బాధ్యులు అంపశయ్య నవీన్, నాగిళ్ల రామశాస్త్రి, వీఆర్ విద్యార్థి, సహృదయ సంస్థ సభ్యులు గన్నమరా గిరిజామనోహరబాబు, కుందావజ్జుల కృష్ణమూర్తి, వనం లక్ష్మీకాంతారావు, డాక్టర్ ఎస్వీఎన్ చారి తదితరులు ఆయనకు నివాళులర్పిస్తూ సంతాపం వ్యక్తం చేశారు.

చర్చలతో సమస్యల పరిష్కారం

కేయూ క్యాంపస్ : అధ్యాపకుల సమస్యలు పరిష్కరించేందుకు యూనివర్సిటీ అధికారులు చర్చల ద్వారా పరిష్కారానికి కృషి చేయాలని కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం (అకుట్) కార్యవర్గం సమావేశం నిర్ణయించింది. అకుట్ కార్యవర్గం శనివారం ఫిజిక్స్ విభాగంలో సమావేశం నిర్వహించి పలు సమస్యలపై చర్చించింది. సమావేశంలో అకుట్ అధ్యక్షుడు ప్రొఫెసర్ బి.వెంకట్రాం రెడ్డి, జనరల్ సెక్రటరీ అసోసియేట్ ఆచార్యులు ఎల్‌పి రాజ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు టి.సవితాజ్యోత్స్న, సంయుక్త కార్యదర్శి డాక్టర్ రాము, కోశాధికారి డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కిండర్ గార్డెన్‌లో గ్రాడ్యుయేషన్ డే

నయీంనగర్ : కేయూసీ రోడ్‌లోని ఏకశిల ఉన్నత పాఠశాలలో కిండర్ గార్డెన్ గ్రాడ్యుయేషన్ వేడుకలను శనివారం నిర్వహించారు. చిన్నారులు గ్రాడ్యుయేషన్ దుస్తుల్లో ముస్తాబై, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలతో అలరించారు. ప్రిన్సిపాల్ బేతి శైలజా రెడ్డి చిన్నారులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు.

సంక్షిప్త సమాచారం

అనుమతి లేని పాఠశాల ఎదుట ధర్నా

విద్యారణ్యపురి : హనుమకొండలోని వడ్డేపల్లి ఎన్‌జీఓస్ కాలనీ ఏరియాలో ఓ ప్రైవేటు పాఠశాల అనుమతి లేకుండా నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ బీఎస్‌ఎఫ్, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్, నాయకులు ప్రసన్నకుమార్, అలీమ్, దుర్గం రవి, శివకుమార్, వంశీ, రమేష్ పాల్గొన్నారు.

శ్రీధర్‌కు డాక్టరేట్



హసన్‌పర్తి : కిట్స్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగంలో అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్న బెజుగామ శ్రీధర్ డాక్టరేట్ అందుకున్నారు. చెన్నైలోని డీమ్డ్–టు–బి యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. డాక్టరేట్ అందుకున్న శ్రీధర్‌ను కళాశాల చైర్మన్ లక్ష్మీకాంతరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ రెడ్డి, సీఎస్ఈ విభాగాధిపతి, డాక్టర్ నిరంజన్‌రెడ్డి, ప్రభాకరాచారి అభినందించారు.

బాధితుడిని ఆర్థికంగా ఆదుకోవాలి



ఖిలా వరంగల్ : మూగజీవాలే ఆధారంగా జీవనం సాగిస్తున్న బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆర్థిక చేయూతను అందించాలని బీజేపీ రాష్ట్ర నేత, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు కోరారు. శనివారం ఖిలా వరంగల్ ఎల్‌పీ గండి వద్ద కాలిబూడిదైన గొర్రెల ఫామ్‌ను బీజేపీ నేతలతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు.

లాభాల బాటలో కల్పలత సూపర్‌బజార్



రామన్నపేట : వరంగల్ కల్పలత సూపర్‌బజార్ (సహకార సొసైటీ) లాభాల బాటలో కొనసాగుతోందని సూపర్‌బజార్ అధ్యక్షుడు వర్ధమాన్ జనార్దన్ పేర్కొన్నారు. శనివారం సూపర్‌బజార్ సర్వసభ్య సమావేశం నిర్వహించగా జనార్దన్ మాట్లాడారు.సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ జగన్ మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు ఎండి షఫి, డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, అయ్యల దానం, స్వర్ణలత, రఘురామారావు, మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

'వ్యవసాయ కూలీలు ఉద్యమించాలి'

న్యూశాయంపేట : గ్రామీణ వ్యవసాయ కూలీల సమస్యలను పట్టించుకోని కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమించాలని బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు టి.వెంకట్రాములు పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండలోని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో ఎం.భిక్షపతి అధ్యక్షతన నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్రామీణ వ్యవసాయ కూలీల సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. సమావేశంలో నాయకులు ఎల్లేశ్, లక్ష్మణ్, వెంకట్రాజం, బి.భిక్షపతి, రాజయ్య, సునీల్, రవి పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాపాడుకుందాం

హన్మకొండ : ఆర్టీసీని, రవాణా రంగాన్ని రక్షించుకుందామని, కార్మిక హక్కులను కాపాడుకుందామని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ రాంచందర్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ నెల 24న తలపెట్టిన చలో పార్లమెంట్‌కు కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

న్యూశాయంపేట : భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా హనుమకొండ కాళోజీ కళాక్షేత్రంలో నేడు (ఆదివారం) నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పూర్వ జిల్లా మాజీ కార్యదర్శి రాగుల రమేశ్ పిలుపునిచ్చారు.

26న చలో అసెంబ్లీని జయప్రదం చేయండి

విద్యారణ్యపురి : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 26న తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సారంగపాణి పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

ఉత్సాహంగా ఉద్యోగుల క్రీడాపోటీలు

హసన్‌పర్తి : ఎఫ్‌సీఐ ఉద్యోగుల క్రీడాపోటీలు శనివారం ఉల్లాసంగా జరిగాయి. నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ పోటీలు నిర్వహించారు. తెలంగాణ రీజియన్ జీఎం రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ..క్రీడలతో శారీరక చేకూరుతోందన్నారు. డీజీఎంలు మోహన్ చంద్ర, జ్ఞాన్, రోహిత్,కోటే, డివిజన్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

జలమయమైన ఫాతిమానగర్ వీధులు



కాజీపేట రూరల్ : కాజీపేటలో శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి ఫాతిమానగర్ వీధి రోడ్లు జలమయమయ్యాయి.ఫాతిమానగర్ అరుణోదయ యూత్ సెంటర్ నుంచి కేథడ్రల్ చర్చికి వెళ్లే రోడ్డు జలమయం కావడంతో బిషప్ బెరెట్టా హైస్కూల్ పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులు,తల్లిదండ్రులు, స్థానికులు ఇబ్బంది పడ్డారు. గ్రేటర్ వరంగల్ అధికారులు, పాలకులు ఫాతిమానగర్ వీధుల్లో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే కాజీపేట డీజిల్ కాలనీ మెయిన్ రోడ్‌లో పెట్రోల్ బంక్ వద్ద ఇరువైపులా రోడ్డు అకాల వర్షానికి జలమయంగా మారింది. వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడ్డారు.

విద్యుత్ ఉత్పత్తిలో సోలార్ ప్లాంట్లు కీలకం

- టీజీ రెడ్‌కో డీజీఎం వెంకటరమణ


సదస్సులో మాట్లాడుతున్న డీజీఎం వెంకటరమణ

హన్మకొండ : విద్యుత్ ఉత్పత్తిలో సోలార్ ప్లాంట్లు కీలకం కానున్నాయని టీజీ రెడ్ కో డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకటరమణ అన్నారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలోని స్పోర్ట్స్ హాల్‌లో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వెంకటరమణ పాల్గొని మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న రైతులకు ప్రొవిజన్ అలాట్‌మెంట్ చేశామని, ఈ నెల 28 తేదీలోపు ఒక మెగావాట్‌కు రూ.లక్ష చొప్పున ఈఎండీ ఆన్‌లైన్ ద్వారా టీజీ రెడ్‌కోకు చెల్లించాలన్నారు. ఫీజిబిలిటీ ఇన్స్‌పెక్షన్ చేసి సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. తర్వాత డిస్కంతో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ చేసుకోవాలని, అనంతరం బ్యాంక్ రుణం మంజూరు చేస్తుందన్నారు. హనుమకొండ ఎస్ఈ పి.మధుసూదన్ రావు, డీఈలు విజేందర్ రెడ్డి, జి.సాంబ రెడ్డి, సామ్యా నాయక్, ఏడీఈలు, రైతులు పాల్గొన్నారు.

'సరైన పరిహారం చెల్లిస్తేనే భూములు ఇస్తాం'

వరంగల్ : మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణంలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు తగిన పరిహారం చెల్లిస్తేనే తమ భూములు ఇస్తామని బాధిత రైతులు తెలిపారు. శనివారం హనుమకొండలోని వరంగల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట రైతులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయం మీదనే ఆధారపడి బతుకుతున్న తాము భూములు కోల్పోతే జీవనోపాధి లేకుండా పోతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే స్పందించి తగిన నష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

24న ఆర్‌జేడీ ఎదుట ధర్నా

విద్యారణ్యపురి : అవకతవకలకు పాల్పడి ప్రస్తుతం జిల్లాలోని కమలాపూర్‌లో పనిచేస్తున్న రాజమల్లయ్యను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న హనుమకొండలోని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట తెలంగాణ టీచర్స్ యూనియన్ (టీటీయూ) ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నామని టీటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్.నరేందర్‌నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం శ్రీనివాస్, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రవి,మాజీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు యూ బిక్షపతి, రాష్ట్రమాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఏరుకొండ నర్సింహస్వామి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

నేటినుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

- 28 వరకు ప్రత్యేక పూజలు


వేణుగోపాలస్వామి మూలవిరాట్

రామన్నపేట : వరంగల్ మట్టెవాడలోని వేణుగోపాలస్వామి ఆలయంలో నేటినుంచి 28వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిటీ అధ్యక్షుడు ఇరుకుళ్ల రమేశ్ తెలిపారు. ఆరు రోజుల పాటు కనుల పండువగా నిర్వహించే బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేస్తున్నారు. భక్తుల కోసం చలువపందిర్లు, తాగునీటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. భక్తులకు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఉత్సవ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈఓ మిట్టపల్లి భాస్కర్, వెంకటకృష్ణ, విశ్వప్రసాద్, తోట నవీన్‌కుమార్, రజనీకాంత్, సాలరాపు పనేష్ పర్యవేక్షించనున్నారు.